## ఒక అపోహ!

ముస్లింలలోని ఒక వర్గం సమాధిలో శిక్షగాని లేక బహుమానంగాని ఉంటుందనే విశ్వాసాన్ని త్రోసిపుచ్చుతోంది. అందుకు ఆ వర్గం వారు చూపించే ఆధారాలు, నిదర్శనాల్లో ఒకటి ఏమిటంటే "శిక్షలు, బహుమానాలు అనేవి ప్రళయదినానికి సంబంధించినవి. అంతకుముందు శిక్షించటం లేక బహుమానం ఇవ్వటం న్యాయానికి విరుద్ధం. కనుక సమాధిలో శిక్షలుగాని బహుమానాలుగాని ఏవీ ఉండవు".

ఈ అపోహకు కారణమేమిటంటే సమాధి జీవితం ప్రస్తుతం మనం గడుపుతున్న జీవితం కంటే వేరుగా ఉంటుంది. అది పరలోక జీవితానికి కూడా భిన్నంగా ఉంటుంది. కనుక సమాధి జీవితంలోని పరిస్థితుల స్వరూపస్వభావాలను అర్థం చేసుకోవటం బ్రతికున్న మనకు అసాధ్యం. దీనిగురించి మేము తొలిపలుకుల తర్వాత అనుబంధంలో "సమాధి జీవితం ఎలా ఉంటుంది!" అనే శీర్షికన చాలా విస్తృతంగా చర్చించాం. అది చదివితే ఇన్షాఅల్లాహ్ ఇలాంటి అనేక అపోహలు దూరమవుతాయి.

పైన పేర్కొనబడిన అపోహకు రెండోకారణం, సమాధిలో లభించే శిక్ష లేక బహుమానం యొక్క స్వభావం సరిగ్గా, స్పష్టంగా తెలియకపోవటం. ఇక్కడ మేము సమాధి జీవితంలో లభించే శిక్ష లేక బహుమానపు స్వభావం సరిగ్గా ఎలా ఉంటుంది అనే విషయాన్ని ఒక ఉదాహరణ ద్వారా స్పష్టం చేయటానికి ప్రయత్నిస్తాం.

పోలీసు ఉన్నతాధికారులు ఎవరైనా వ్యక్తి గురించి "ఫలానా అతను నేరాలను వృత్తిగా చేసుకొని బతుకుతున్నాడు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ మాదగ్గర ఉన్నాయి.

https://teluguislam.net



అతన్ని అరెస్టు చేయండి" అని తమ క్రింద పనిచేసే పోలీసుల్ని ఆదేశించారనుకోండి. అప్పుడు పోలీసులు అతన్ని అరెస్టు చేస్తారు. చట్టప్రకారం కోర్టు నుంచి తీర్పు వెలువడనంతవరకూ అతన్ని ఏవిధంగానయినా శిక్షించే అధికారం పోలీసులకు లేకపోయినప్పటికీ అతన్ని తమ కస్టడీలో ఉంచిన పోలీసువర్కర్లకు అతని నేరప్రవృత్తి గురించి తెలిసి ఉంటుంది. కనుక వారు అతన్ని విపరీతంగా అసహ్యించుకుంటారు, గదుముతూ ఉంటారు. "కోర్టు నుంచి తీర్పు రానీ, అప్పుడు నీ అంతు తేలుస్తాం" అని బెదిరిస్తారు, భయపెడ్తారు. పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు నిజానికి అతనిపట్ల చాలా నీచంగా, అవమానకరంగా ప్రవర్తించటం జరుగుతుంది. అతన్ని కుర్చీమీద కూర్చోనివ్వరు. మంచం మీద పడుకోవటానికీ అనుమతించరు. అతని దగ్గరినుంచి వెళ్ళే ప్రతిపోలీసు అతని ప్రాణం తీస్తాడా అన్నట్లు అతని వంక కోపంగా చూస్తూ వెళ్తాడు.

తెలుస్తూనే ఉంది. ఇలాంటి మనిషి తన కేసు కోర్టుకు వెళ్ళాలనిగాని, అక్కడ చట్టప్రకారం తీర్పు జరగాలని గాని ఎన్నటికీ కోరుకోడు. కాని ఎప్పుడయితే కోర్టులో అతని కేసుకు సంబంధించి విచారణ జరిగి తీర్పు వెలువడుతుందో, ఆ తీర్పు ప్రకారం అతని అసలు శిక్ష-కొరడా దెబ్బలు, ఇతర బాధలు లేక జరిమానా మొదలగునవి మొదలవుతాయి. కారాగార శిక్షకు ముందు పోలీసుకస్టడీలో ఉన్నప్పుడు నిందితునికి కలిగే మానసిక హింస కారాగారంలో లభించే శారీరకశిక్ష కంటే వేరయినప్పటికి అది కూడా ఒక శిక్షే కదా! సమాధి శిక్ష కూడా పోలీసు కస్టడీలో నిర్బంధించబడిన నిందితునికి కలిగే మానసిక హింస లాంటిదే.న్యాయస్థానంలో ఆ నిందితుని కేసు విచారణ జరగటం, దాని ప్రకారం శిక్షపడటం ఇంకా మిగిలి ఉంది. అదిమటుకు ప్రళయదినానే జరుగుతుంది. కాని ప్రళయంకంటే ముందు అవిశ్వాసికి అతని పర్యవసానం తెలియజేయటం, అతన్ని అవమానించటం పరాభవించటం, అతనికి అతని పరలోకస్థానం చూపించటం కూడా ఒక రకంగా శిక్షే. అఫ్‌కోర్స్ అది నరక శిక్షకు భిన్నంగా ఉండవచ్చు.

అలాగే సమాధిలో విశ్వాసికి, దైవభక్తిపరునికి లభించే శిక్ష లేక బహుమానపు ఉదాహరణ ఈ వ్యక్తిని పోలి ఉంటుంది. పోలీసులు అతన్ని ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అరెస్టు అయితే చేశారు కాని, అరెస్టుకాబడిన వ్యక్తి నిర్దోషి అనీ, చట్టబద్ధుడు, మంచి పౌరుడనీ కనుక అతని పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించమని కూడా ఉన్నతాధికారులు వారికి పురమాయించి ఉంటారు. అలాంటప్పుడు న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడక ముందు పోలీసులు అతన్ని విడుదల చేయలేకపోయినా అతని మంచితనం, మర్యాదల మూలంగా పోలీసులందరూ అతన్ని గౌరవదృష్టితో చూస్తారు. అతని అవసరాలన్నీ తీరుస్తారు. పైగా "మీరేమీ చింతించకండి. మీరు నిర్దోషులు.

https://teluguislam.net



మీరు తప్పకుండా న్యాయస్థానంలో గౌరవంగా నిర్దోషి అయినట్లు ప్రకటించబడతారు' అని అతనికి ధైర్యం చెబుతారు. ఇలాంటి వ్యక్తి తన కేసు త్వరగా న్యాయస్థానంలో ప్రవేశపెట్టబడాలనీ, వీలైనంత త్వరగా తను సుఖశాంతులతో కూడిన జీవితం గడపాలని విపరీతంగా కోరుకుంటాడు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చి న్యాయస్థానం గౌరవంగా అతన్ని నిర్దోషిగా ప్రకటించినప్పుడు పోలీసులు పూర్తి గౌరవమర్యాదలతో అతన్ని సుఖదాయకమైన శాంతిపూర్వకమైన అతని ఇంటికి చేరుస్తారు. రిమాండులో ఉన్నప్పుడు అతనికి లభించిన గౌరవం, సుఖం తన ఇంటికి చేరుకున్న తర్వాత లభించే గౌరవం, సుఖం లాంటిది కాకపోవచ్చు. అయినప్పటికీ అది కూడా అతని మంచితనానికి లభించిన బహుమానం, గౌరవమే కదా! సమాధిలో విశ్వాసికి లభించే గౌరవసత్కారాల సంగతి కూడా పూర్తిగా అంతే! స్వర్గంలో ఇంటి శుభవార్త అతనికి వినిపించబడుతుంది. ఇతర అనుగ్రహాలు చూపించబడతాయి. అన్ని విధాల సుఖశాంతులు కల్పించబడతాయి. అయితే విశ్వాసి ఆ అనుగ్రహాలను, సుఖాలను క్రియాత్మకంగా అనుభవించటం అనేది తను దేవుని న్యాయస్థానంలో నిర్దోషిగా ప్రకటించబడి పూర్తి గౌరవమర్యాదలతో స్వర్గంలోకి ప్రవేశించే రోజు మాత్రమే జరుగుతుంది. వల్లాహు అలము బిస్సవాబ్!